ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న సైనికుడికి స్వాగతం పలుకుతున్న నాయకులు

'ఆపరేషన్ సిందూర్' సైనికుడికి ఘన స్వాగతం

కాజీపేట, జూన్ 1 : కాజీపేట రైల్వే జంక్షన్‌లో ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని వచ్చిన సైనికుడు గుగులోత్ రంజిత్ కుమార్ నాయక్‌కు ఆదివారం పలువురు ఘన స్వాగతం పలికారు. మడికొండకు చెందిన గుగులోత్ నాగేశ్వర్ రావు-శాంత దంపతుల కుమారుడు రంజిత్ కుమార్ నాయక్ రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ బేస్‌లో సైనికుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇటీవల భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నాడు. అనంతరం మడికొండ స్వస్థలానికి వచ్చిన రంజిత్ కుమార్ నాయక్‌కు కాజీపేట రైల్వే స్టేషన్‌లో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజు యాదవ్, మాజీ సర్పంచ్ వస్కుల వెంకటస్వామితో పాటు పలువురు స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ నాయక్ మాట్లాడుతూ.. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పల్లపు అర్జున్, బైరి లింగమూర్తి, వస్కుల శంకర్, విజయ్, బాలాజీ, భూక్యా శంకర్ నాయక్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధం

తెలంస్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ -327 సెక్రటరీ జనరల్ శ్రీధర్

హనుమకొండ, జూన్ 1 : విద్యుత్ ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు సిద్ధమని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ -327 సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ అన్నారు. ఆదివారం వడ్డేపల్లి రోడ్డులోని పల్లా రవీందర్‌రెడ్డి భవన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యుత్ ఆర్టిజన్ల సమావేశానికి ఆయన హాజరయ్యారు. రాష్ట్రంలోని 22వేల మంది ఆర్టిజన్ల ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్, దశల వారీ కన్వర్షన్, అపరిష్కృత సమస్యలపై చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరంన్నర దాటినా తమ సమస్యలను పరిష్కరించడం లేదని ఆర్టిజన్లు, నాయకులు శ్రీధర్ దృష్టికి తీసుకొచ్చి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే ఆర్టిజన్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లామన్నారు. మరో రెండు రోజుల్లో డిప్యూటీ సీఎంను కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరునున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోతే ఎస్‌పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్, ట్రాన్స్‌కో, జెన్‌కో కంపెనీ ఆఫీసుల ఎదుట పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తామని, అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే నోటీసులు ఇచ్చి సమ్మెకు వెళ్లేందుకు వెనుకాడే ప్రసక్తి లేదని, అందుకు తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ -327 ఐఎన్‌టీయూసీ ప్రభుత్వ అనుబంధ సంస్థ సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టిజన్ నాయకులు ధరావత్ సికిందర్, వల్లాల యుగంధర్, పప్పు వెంకటేశ్వర్లు, చింతలపూడి సతీశ్, గన్ను నరేందర్‌రెడ్డి, చెన్నవేని బాబన్న, సతీశ్‌రెడ్డి, సలీంపాషా, శ్రీనివాసరెడ్డి, అటికేటి రవీందర్, వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఆర్టిజన్లు, ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ తెలంగాణ మహిళా అధ్యక్షురాలు తులసి, వరంగల్ జిల్లా సెక్రటరీ బుచ్చయ్య గౌడ్, భువనగిరి డివిజన్ సెక్రటరీ ఆర్‌సీ రెడ్డి పాల్గొన్నారు.

ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ -327 సెక్రటరీ జనరల్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆర్టిజన్లు

గొర్ల కాపరుల సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు, జూన్ 1 : గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలు పరిష్కరించి, గ్రామీణ సొసైటీ ఎన్నికలు జరపాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాడబోయిన లింగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్లో ముద్దం సాంబయ్య అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గొర్రెలు, మేకలకు మేత, నీరు, వైద్యం చేయించాలన్నారు. గొర్లు, మేకలకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదవశాత్తు చనిపోయిన గొర్ల కాపరులకు రూ.10లక్షలు, 50 సంవత్సరాలు దాటిన వారికి రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మండల కమిటీ ఎన్నిక ఏకగ్రీవం..

జీఎంపీఎస్ మండల కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. గౌరవ అధ్యక్షుడిగా ముద్దం సాంబయ్య, గౌరవ సలహాదారులుగా కాడబోయిన రమేశ్, మండలాధ్యక్షుడిగా మిర్యాల కుమార్, ఉపాధ్యక్షులుగా నాగరబోయిన ఓదెలు, దుంకదువ్వ రాజన్న, నాగరబోయిన సాంబయ్య, ప్రధాన కార్యదర్శిగా శెట్టి లింగయ్య, సహాయ కార్యదర్శులుగా ముద్దం రమేశ్‌బాబు, నాగరబోయిన సాంబయ్య, ఆర్గనైజర్‌గా కంచ సతీశ్, కోశాధికారిగా ఓదెలు, కమిటీ సభ్యులుగా గోపు ఎల్లయ్య, నాగరబోయిన దిలీప్, గడ్డి కుమార్, కంచ సతీశ్, కాడబోయిన రవి, రమేశ్, మొగిలి, మంగ రాజయ్య ఎన్నికయ్యారు.

నేటి గ్రీవెన్స్ రద్దు

హనుమకొండ, జూన్ 1 : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించనున్న గ్రీవెన్స్ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టరేట్ ప్రావీణ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గ్రీవెన్స్ రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు గమనించాలని, వచ్చే సోమవారం యథావిధిగా గ్రీవెన్స్ నిర్వహిస్తామని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

భీమదేవరపల్లి/శాయంపేట, జూన్ 1 : భూ భారతి చట్టంలో భాగంగా మండలంలో సోమవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తహసీల్దార్ రాజేశ్ తెలిపారు. 3న భీమదేవరపల్లి, 4న కొప్పూరు, 5న గట్లనర్సింగాపూర్, 6న కొత్తకొండ, 9న ముత్తారం, 10న మల్లారం, 11న మాణిక్యాపూర్, 12న ముల్కనూరు, 13న ముస్తాఫాపూర్, 14న కొత్తపల్లి, 15న రత్నగిరి, 16వ తేదీన వంగర గ్రామాల్లో సదస్సులు ఉంటాయని చెప్పారు. పట్టాదారు పేరు సవరణ, భూమి స్వభావం సవరణ, సాదాబైనామాలో కొనుగోలు చేసిన, కుటుంబంలో పట్టాదారులు మరణించినా వారసత్వంగా పట్టా మార్పిడి చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. శాయంపేట మండలంలో ఈ నెల 3 నుంచి 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. 3న పత్తిపాక, 4న హుస్సేన్‌పల్లి, 5న నేరేడుపల్లి, 6న కాట్రపల్లి, 9న వసంతాపూర్, 10న పెద్దకోడెపాక, 11న గట్లకానిపర్తి, 12న మైలారం, 13న కొత్తగట్టుసింగారం, 16న తహరాపూర్, 17న కొప్పుల, 18న ప్రగతిసింగారం, 19న శాయంపేట గ్రామాల్లో సదస్సులు జరుగుతాయని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దు

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాయిని, మేయర్, బల్దియా కమిషనర్

న్యూశాయంపేట, జూన్ 1 : ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎవరికి డబ్బులు ఇచ్చినా సహించేది లేదు.. మా పార్టీ వారైనా, అధికారైనా డబ్బులు తీసుకున్నట్లు తెలియజేస్తే రూ.25వేలు ఇస్తానని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హంటర్‌రోడ్‌లోని అభిరామ్ గార్డెన్స్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా పశ్చిమ నియోజవర్గానికి 3,500 ఇండ్లను మంజూరు చేసిన క్రమంలో ఆయన మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి 660 మంది లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ మంజూరు పత్రాలను అందజేశారు. కొన్ని చోట్ల అర్హులకు ఇళ్లు రాలేదని తన దృష్టికి వచ్చిందని, అర్హత ఉండి పేరు రాని వారి కోసం ప్రత్యేకంగా ప్రయత్నిస్తానని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం

హనుమకొండ చౌరస్తా, జూన్ 1 : సైక్లింగ్ వల్ల ఎంతో ఆరోగ్యంగా ఉంటారని సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజయ్య పిలుపునిచ్చారు. అంతర్జాతీయ సైక్లింగ్ దినోత్సవం సందర్భంగా ఆదివారం హనుమకొండ డీఎస్ఏ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి డీవైఎస్‌వో దేవిక జెండా ఊపి సైకిల్ ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్ట్రెస్‌తో వివిధ వివిధ వ్యాధుల గురవుతున్నారని, దీని నివారణకు సైక్లింగ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వాకర్స్ సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్, ఖోఖో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తోట శ్యామ్‌ప్రసాద్, డీఎస్ఏ కోచ్‌లు నరేందర్, రమేశ్, విష్ణు, అప్జల్, శంకర్, వెంకట్, ప్రభుదాస్ పాల్గొన్నారు.

విద్యతోనే విలువలు

కాజీపేట, జూన్ 1 : విద్యతోనే విలువ, గౌరవం పెరుగుతుందని జనవికాస అధ్యక్షుడు లూర్ధు మర్రెడ్డి అన్నారు. ఫాతిమానగర్‌లోని బాల వికాస శిక్షణ కేంద్రంలో స్కూల్ ప్రిపరేటరీ డే సందర్భంగా (అనాథ బాల బాలికలు) 1వ తరగతి నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులకు సుమారు రూ.9లక్షల విలువైన ఎడ్యుకేషన్ కిట్లు, నిత్యావసరాలు ఆదివారం పంపిణీ చేశారు. బాల వికాస మేనేజర్ శివరాం, మహిళాభివృద్ధి పథకం ప్రతినిధులు సుజాత, జ్యోతి, అమూల్య పాల్గొన్నారు.

గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న గోపా బాధ్యులు

గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

న్యూశాయంపేట, జూన్ 1 : హంటర్ రోడ్డులోని గౌడ హాస్టల్ భవనంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆదివారం గోపా హనుమకొండ, వరంగల్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ప్రతిభా అవార్డులు అందజేశారు. గోపా హనుమకొండ, వరంగల్ జిల్లా అధ్యక్షులు చిర్ర రాజు గౌడ్, లక్ష్మీనారాయణగౌడ్ అధ్యక్షతన జరిగిన సభలో ఏఐసీసీ ఓబీసీ కో-ఆర్డినేటర్ కత్తి వెంకటస్వామిగౌడ్ హాజరై 90 మంది విద్యార్థులకు నగదు పారితోషకం, షీల్డ్‌లు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో గోపా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు విజయ్‌భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, గౌడ ప్రతిభా పురస్కార్ కార్యక్రమ కన్వీనర్ వడ్లకొండ వేణుగోపాల్, గోపా వరంగల్ జిల్లా సీనియర్ నాయకులు పెద్ది వెంకట్ నారాయణ, బూర విద్యాసాగర్, తాళ్లపల్లి జనార్దన్, బొనగాని యాదగిరి, ఏసీపీ నాగయ్య, విజయ్ పాల్గొన్నారు.

వివాహం కావడం లేదని యువకుడి ఆత్మహత్య

ఎల్కతుర్తి, జూన్ 1 : గుంటూరుపల్లికి చెందిన నెట్టెం సతీశ్ (30) వివాహం కావడం లేదని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎల్కతుర్తి ఎస్సై అక్కెనపల్లి ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సతీశ్ వ్యవసాయం చేసుకుంటూ తల్లిదండ్రులతో జీవిస్తున్నాడు. కొన్ని రోజులుగా తనకు వివాహం కావడం లేదని బాధపడుతుండేవాడు. గత నెల 29న వ్యవసాయ బావి వద్దకు వెళ్తున్నాని తల్లిదండ్రులకు చెప్పి వెళ్లాడు. మధ్యాహ్నం అయినప్పటికీ తిరిగిరాకపోవడంతో తండ్రి వెంకటేశ్వర్లు కుమారుడికి ఫోన్ చేయగా, బావి వద్దే ఉన్నానని పురుగుల మందు తాగినట్లు చెప్పాడు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు బావి వద్దకు వెళ్లి అతడిని ఎంజీఎం దవాఖానకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త జనులకు తెలియజేయునది ఏమనగా నా క్లయింటు అయిన చెన్నమనేని జయశ్రీ మేనేజింగ్ పార్టనర్ మంజునాథ రియల్ ఎస్టేట్స్ మరియు సాయినాథ్ ఎంక్లేవ్ గారు సర్వేనెంబర్ 385, 386, 177, 199/A 199/B, 200 & 201 రంగశాయిపేట్ గ్రామము, భీమదేవరపల్లి మండలం, వరంగల్ జిల్లాలోని ఎ॥ 23-22 గుంటల భూమిని వేరు వేరు రిజిస్ట్రీ దస్తావేజుల ద్వారా కొనుగోలు చేసి KUDA పర్మిషన్ ద్వారా లే అవుట్ ప్లాన్ ద్వారా ప్లాట్స్ చేసినారు. అట్టి లేఅవుట్ D.P.No. 87/2003 మరియు లేఅవుట్ మ్యాప్ ఫైల్‌ను C3/1310/2003 పొంది ఉన్నారు. కాగా బొమ్మగాని (గట్టు) విజయ అను వ్యక్తి తప్పుడు కాగితములు సృష్టించి సివిల్ దావా ఓ.ఎస్. నెంబర్ 1695/2004 ను అప్పటి ఐదవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వరంగల్ నందు నా క్లయింట్ పై కేసు వేసినారు. దావా దివి. 17-12-2014 నాడు ఇట్టి కేసును న్యాయస్థానం కొట్టివేసినా క్లయింట్‌కు అనుకూలంగా తీర్పు వెలువడించినారు. సదరు బొమ్మగాని (గట్టు) విజయపైన తెలిపిన కేసు ఓడిసప్పటికీ మోసపూరితంగా, దురుద్దేశంతో 1) వీరమల్ల వేణు 2) కి॥శే॥ బత్తిని చంద్రశేఖర్ 3) బత్తుల సంపత్ మరియు 4) బొమ్మగాని శ్రీనివాస్ అను వ్యక్తులతో కలిసి తప్పుడు అగ్రిమెంటు-కం-జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ ఎ. 1-08 గుంటల భూమికి సృష్టించి మోసపూరితంగా అమ్మ చూపుటకు ప్రయత్నిస్తున్నారు. పైన తెలిపిన సదరు వ్యక్తులకు గాని వారి ద్వారా కొనుగోలు చేయు వ్యక్తులకు గాని చట్టపరంగా ఇబువంటి హక్కులు సంక్రమించబోవని మరియు పైన తెలిపిన అగ్రిమెంటు-కం-జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ తేదీ. 20-4-2009, దస్తావేజు నెం. 1813/09 చట్టపరంగా చల్లనేరదని ఇట్టి ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. మరియు పైన తెలిపిన సర్వే నెంబర్లలో గల భూమికి నా క్లయింట్ సర్వహక్కు భుక్తములు కలిగి ఉన్నది. కావున ఎవరైనా నా క్లయింట్ యొక్క భూమిపై మోసపూరితంగా క్రయవిక్రయాలు జరిపినచో చట్టపరమైన చర్యలకు అర్హులగుదురని ఇట్టి బహిరంగ ప్రకటన ద్వారా సమస్త జనులకు తెలియజేయునైనది.

ఇట్లు బెల్లి జగదీష్ యాదవ్, అడ్వకేట్
ఇ.నెం. 2-7-1137/106, నీలం ఎన్‌క్లేవ్, కనకదుర్గ కాలనీ, హనుమకొండ. సెల్: 9908171829

యోగా శిక్షణను వినియోగించుకోవాలి

శాయంపేట, జూన్ 1 : ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు మూడు రోజుల పాటు శాయంపేటలోని నవోదయ హైస్కూల్‌లో శ్రీరామ చంద్ర మిషన్ హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత యోగ, ధ్యాన శిక్షణ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై జక్కుల పరమేశ్ అన్నారు. ఆదివారం స్టేషన్‌లో ఉచిత యోగా తరగతుల కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో శారద, అచ్చయ్య, రమేశ్, రాంబాబు, సత్యనారాయణ, సుధాకర్, సురేందర్ పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి

ఐనవోలు, జూన్ 1 : బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని టీఎస్‌యూటీఎస్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు కిరణ్‌కుమార్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో టీఎస్‌యూటీఎస్ ఆధ్వర్యంలో ప్రచార జాత నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీందర్‌రాజు, పెండెం రాజు, ఉపాధ్యక్షుడు రాజారాం, జిల్లా కార్యదర్శులు లింగారావు, చంద్రయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

మాజీ తహసీల్దార్ వీరన్న మృతి బాధాకరం

మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

న్యూ శాయంపేట, జూన్ 1 : ప్రభుత్వ అధికారిగా నిబద్ధతతో విధులు నిర్వర్తించి ఉన్నతాధికారులు, ప్రజల మన్ననలు పొందిన మాజీ తహసీల్దార్ కోడం వీరన్న మృతి చెందడం బాధాకరమని మండలి డిప్యూటీ చైర్మన్ బండి ప్రకాశ్ అన్నారు. న్యూశాయంపేటలో ఇటీవల మరణించిన కోడం వీరన్న స్వగృహంలో ఆదివారం సంతాప సభ జరిగింది. వీరన్న చిత్రపటానికి పూలమాల వేసి బండా నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు, డివిజన్ నాయకులు జానకీరాములు, కోడం సురేశ్ పాల్గొన్నారు.

వీరన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బండా ప్రకాశ్

ఉపాధ్యాయుల సర్దుబాటు నియమాలు మార్చాలి

తిరుపతిరెడ్డి, పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు

హనుమకొండ చౌరస్తా, జూన్ 1 : ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేసే విధంగా సర్దుబాటు ఉత్తర్వులు ఉండాలని, అసంబద్ధమైన రేషనలైజేషన్ నిబంధనలు పాటించాలనడం విడ్డూరమని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు మండల తిరుపతిరెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వమిచ్చిన రేషనలైజేషన్ నిబంధనలు ప్రాథమిక విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయని, 60 మంది పిల్లలకు ఇద్దరు టీచర్లు అని నిబంధన విధించడం సరికాదన్నారు. ఈ ఉత్తర్వులను సవరించి 30 వరకు విద్యార్థులకు ముగ్గురు టీచర్లు, 60 వరకు ఐదుగురు టీచర్లు ప్రాథమిక పాఠశాలలో ఉండాలన్నారు. ఈ నెల 6 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్న బడిబాట కార్యక్రమం పూర్తయిన తర్వాత ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. సీనియర్ ఉపాధ్యాయులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని, లేకపోతే జూనియర్ ఉపాధ్యాయుడు తప్పకుండా వెళ్లేలా సవరించాలని కోరారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

కాజీపేట, మే 1 : ఉప్పల్ రైల్వేస్టేషన్ సమీపంలో రైలు ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. కాజీపేట జీఆర్పీ సీఐ నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ రైల్వేస్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు తాకి మృతి చెందినట్లు తెలిపారు. అతడి వయసు దాదాపు 30 ఏళ్లు ఉంటుందని, బ్లూ కలర్ జీన్స్, లైట్ యాష్ కలర్ గడల షర్టు ధరించి ఉన్నట్లు తెలిపారు. కదులుతున్న రైల్లో నుంచి పడి లేదా పట్టాలు దాటుతుండగా రైలు తాకడంతో మృతి చెందినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయన్నారు. మృతదేహాన్ని ఎంజీఎం దవాఖాన మార్చురీకి తరలించనున్నట్లు తెలిపారు. ఎవరైనా సంబంధీకులుంటే కాజీపేట జీఆర్పీ సీఐని సంప్రదించాలని కోరారు. మృతుడు జయశంకర్ జిల్లా చిట్యాల మండలం చల్లగరిగె గ్రామానికి చెందిన జనగాం మహేశ్ అని, ప్రస్తుతం జమ్మికుంట రైల్వేస్టేషన్ డిప్యూటీ స్టేషన్ మాస్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

అవతరణ వేడుకలకు ముస్తాబైన పోలీస్ పరేడ్ గ్రౌండ్

నేడు తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

- పోలీసు పరేడ్ గ్రౌండ్‌ను ముస్తాబు చేసిన అధికారులు

హనుమకొండ, జూన్ 1 : హనుమకొండ పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు నిర్వహించనున్నారు. ఇందుకు పోలీసు పరేడ్ గ్రౌండ్‌ను ముస్తాబు చేశారు. కలెక్టరేట్‌ను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం 9.30 గంటలకు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రారంభమయ్యే వేడుకలకు ముఖ్య అతిథిగా మంత్రి కొండా సురేఖ హాజరై జాతీయ జెండా ఆవిష్కరిస్తారు.

12మంది పోలీసులకు సేవా పతకాలు

సుబేదారి, జూన్ 1 : రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో పనిచేస్తున్న 12మంది పోలీసు అధికారులను సేవా పతకాలకు జిల్లా అధికార యంత్రాంగం ఎంపిక చేసింది. హనుమకొండ ఏఎస్సై ఏ రఘురెడ్డికి ఉత్తమ సేవా పతకం, వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, సీసీఆర్‌బీలో పనిచేస్తున్న ఎస్సై జే విల్‌సన్, సుబేదారి ఏఎస్సై పీ ప్రభాకర్‌రెడ్డి, ఆర్ఎస్సైలు ఎండీ మెక్బాల్ పాషా, ఎం రామ్‌ధన్, కాజీపేట ఏఎస్సై వీ చంద్రమౌళి, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బుస్సు భీమయ్య, కానిస్టేబుళ్లు బీ రమేశ్, కే తిరుపతిగౌడ్‌కు పతకాలు దక్కాయి.

కొండా లక్ష్మణ్ బాపూజీకి భారతరత్న ప్రకటించాలి

పరకాల, జూన్ 1 : తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమాల్లో అన్నీ తానై ముందు నిలిచిన నిఖార్సైన తెలంగాణ పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీకి భారతరత్న ఇవ్వాలని పోపా పరకాల అధ్యక్షుడు రాజేశ్వర ప్రసాద్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజు బాపూజీ విగ్రహాల వద్ద జాతీయ పతాకాలను ఆవిష్కరించాలని ఫెడరేషన్ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం సాయంత్రం పరకాలలోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి కొండా లక్ష్మణ్ బాపూజీ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ మెండు రవీందర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో, ఆ తర్వాత హైదరాబాద్ సంస్థాన విముక్తి పోరాటంలో ముందు నిలిచిన కొండా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన మంత్రి పదవికి రాజీనామా చేశారని కొనియాడారు. తన ఆస్తులను ఉద్యమానికి త్యాగం చేశారన్నారు. ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ, మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు బాసని దయాకర్, దాసరి భిక్షపతి, పద్మశాలి ఫైనాన్స్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రాచర్ల అశోక్, మధుసూదన్, పద్మశాలి ట్రస్ట్ బోర్డ్ ప్రధాన కార్యదర్శి చిదురాల దేవేందర్, పోపా ప్రధాన కార్యదర్శి దుంపేటి నాగరాజు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

యుగేంధర్ (ఫైల్)

హసన్‌పర్తి, జూన్ 1 : వ్యక్తి అదృశ్యం అయిన ఘటన కొత్తపల్లిలో జరిగింది. సీఐ చేరాలు కథనం ప్రకారం.. మండలంలోని కొత్తపల్లికి చెందిన కొత్తూరు యుగేంధర్ (50) గత నెల 29న బయటికి వెళ్లి వస్తానని చెప్పి మూడు రోజులైనా ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో వారు ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అతడి ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కాపర్ వైర్ దొంగల అరెస్టు

దామెర, మే 1: వ్యవసాయ మోటర్లు, కాపర్ వైర్ దొంగిలించిన కేసులో పలువురుని అరెస్టు చేసినట్లు ఎస్సై అశోక్ ఆదివారం తెలిపారు. ఒడిషాకు చెందిన మాలిక్‌రాజు(29), వరంగల్ జిల్లాకు చెందిన గుగులోత్ నవీన్(26)ను అరెస్టు చేసి వారి వద్దు ఉన్న 153కిలోల కాపర్ వైర్, స్కూటీ, రూ.2వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి

సమ్మయ్య (ఫైల్)

ఎల్కతుర్తి, జూన్ 1 : మండల కేంద్రానికి చెందిన లోకిని సమ్మయ్య(60)ను కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై అక్కెనపల్లి ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సమ్మయ్య మోపెడ్‌పై ముల్కనూరు రోడ్డు నుంచి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ముల్కనూర్ వెళ్తున్న కారు సమ్మయ్య మోపెడ్‌ను ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయింది. ఈ ఘటనలో సమ్మయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 సిబ్బందికి సమాచారం అందించగా, వారు వచ్చి ఆస్పత్రికి తరలిస